సెప్టెంబర్ - అక్టోబర్, 2009

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

యెహోవా కన్నులు ప్రతి స్థలముమీద నుండును.



# "మనస్సులోని మాట"

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

మన ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీ అందరికి నా హృదయపూర్వక వందనములు. మిమ్ములను, మీ కుటుంబములను కాపాడి, నడిపిస్తున్న దేవునికి కృతజ్ఞతాస్తుతులు.

ప్రేమతో కూడిన మీ ప్రయాసను, విశ్వాసముతో కూడిన మీ పనిని, యేసుక్రీస్తు రాకడ కొరకు నిరీక్షణతో కూడిన మీ ఓర్పును జ్ఞాపకము చేసికొనుచూ, దేవునికి స్తుతులు చెల్లించుచున్నాను.

సంవత్సరములు త్వరత్వరగా గతించుపోవుచున్నట్లుగా ఉన్నవి. ప్రపంచములో మానవుని జీవన స్థితిగతులు వేగముగా మార్పు చెందుచున్నవి. ఆర్థిక వ్యవస్థలు కోలుకుంటున్న తరుణంలో "స్వైన్ ఫ్లూ" వ్యాధి ద్వారా పెను ప్రమాదం పొంచి ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యాధి వలన మన దేశం ఎంతో నష్టపోయే అవకాశం ఉన్నదని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (W.H.O) వారు తెలియపరిచారు. కనుక మనము బాధ్యతతో ఈ వ్యాధి వలన అనేకులు మరణించకుండా ఉండాలని ప్రార్థన చేయవలసిన వారమై యున్నాము.

నామకార్థ క్రైస్తవ్యం స్వైన్ ఫ్లూ వ్యాధి కంటే వేగంగా విస్తరిస్తున్నట్లుగా ఉన్నది. అనగా సమర్పణతో దేవునిని సేవించే వారు సైతము ఆత్మీయ విలువలు లేని కొందరిని చూచి, సమర్పణల నుండి దిగజారటం కనబడుచున్నది. అయితే సంవత్సరములు జరుగుచున్నప్పుడు మనము దేవుని దినపు రాకడ కొరకు కనిపెట్టుచూ, దానిని ఆశతో అపేక్షించుచూ, పరిశుద్ధమైన ప్రవర్తనతోను, భక్తితోను ఎంతో జాగ్రత్త గల వారమై ఉండవలెను.

అట్టి విలువలతో కూడిన విశ్వాస జీవితమును జీవిస్తారని ఆశిస్తూ......

మీ సహోదరుడు....



సెప్టెంబర్ - అక్టోబర్, 2009

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక


## ఈ సంచికలో...


- తండ్రి యందు నమ్మిక యుంచగలవా? ........ 2
- ప్రార్థన మెట్లు ........ 5
- అనుకరణ (స్త్రీల ప్రత్యేకం) ........ 6
- మరపురాని బహుమానం ........ 8
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 6వ భాగము ........ 9
- ధైర్యం (బాలల శీర్షిక) ........ 11
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 12
- ఇది తెలుసా? (కంబోడియా) ........ 14
- మనకు సంతోషం ఎప్పుడు కలుగుతుందంటే........ 15
- ఆత్మ ఫలము ........ 16
- అరారాతు పర్వతము ........ 17
- బైబిల్ క్విజ్-6 ........ 18
- జన్మదిన శుభాకాంక్షలు ........ 19


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# తండ్రి యందు నమ్మిక యుంచగలవా ?

- బ్రదర్ శేఖర్



నమ్మిక (Trust) అనే పదం మనం చాలా ఎక్కువగా వాడుచూ ఉన్నా పరిశుద్ధ గ్రంథంలో దాని యొక్క ప్రాధాన్యత చాలా మందికి బోధపడదు. దేవుని యందు నమ్మిక ఉంచడం అంటే దేవుని యొక్క శక్తి, సామర్థ్యము, యోగ్యత, మంచితనము మీద స్థిరంగా ఆధారపడటం అని అర్థము. అనేక సంవత్సరాల క్రితం ఒక సాహసికుడు (Acrobat) నయాగరా జలపాతం దగ్గర ఒక తీగకట్టి ఈ వైపునుండి ఆవైపునకు నడవటానికి సిద్ధమయ్యాడు. అతను అంతకుముందు ప్రయత్నాలలో ఆ సాహసాన్ని విజయవంతంగా చేసియున్నాడు. కాబట్టి అక్కడ గుంపుకూడి ఉన్న ప్రజలు ఈసారి కూడా చేయగలడని కరతాళ ధ్వనులతో అతనిని ప్రోత్సాహ పరుస్తూ ఉన్నారు. వెయ్యి అడుగులు సాగే ఆ నడక ఏమాత్రం బ్యాలెన్స్ తప్పినా క్రింద 120 అడుగులు లోతులో ఉన్న జలపాతంలో పడి ప్రాణాలు కోల్పోవడం జరగవచ్చు. అక్కడ చూస్తూ ఉన్నవారంతా ఆ వ్యక్తి ఆ సాహసం చేయగలడని నమ్ముతున్నారు (Beleiving). సాహసం ప్రారంభించే ముందు ఆ వ్యక్తి అక్కడ చూస్తూ ఉన్నవాళ్ళతో ఇలా అన్నాడు. “నేను గతంలో ఈ సాహసాన్ని విజయవంతంగా చేశాను కాబట్టి ఈసారి క్రొత్త సాహసం చేయాలనుకుంటున్నాను. మీరంతా నా సామర్థ్యాన్ని నమ్ముతున్నారు కాబట్టి ఎవరైనా ఒకరు నాతో వస్తే నేను వారిని క్షేమంగా ఆదరికి చేరుస్తాను. ఒక్కరు కూడా ముందుకు రాలేదు కారణం మనందరం ఊహించగలం. వారిలో ఎవ్వరూ కూడా తమ ప్రాణాలను అతని చేతిలో పెట్టేంతగా అతన్ని నమ్మలేకపోతున్నారు (Unable to Trust in him). ఈలోగా ఒక బాలిక ముందుకు వచ్చి నేను సిద్ధమే అని చెప్పింది, అంతా ఆశ్చర్యపోతుండగా, తెలిసిన విషయం ఏమిటంటే ఆ బాలిక ఆ సాహసికుని కుమార్తె అని. ఆమెకు తన తండ్రి యొక్క సామర్థ్యం మీద పూర్తి నమ్మకం ఉంది. తన తండ్రి చేతులలో ఉంటే ఎక్కడ ఉన్నా, ఎటువంటి పరిస్థితులలో అయినా ఏ హాని జరగదని ఆమె యొక్క ప్రగాఢ నమ్మకం. సరిగ్గా ఇదే

నమ్మకమును మన పరలోకపు తండ్రి నీనుండి, నానుండి కోరుకుంటున్నాడు.

ఒక వ్యక్తి తన జీవితమును దేవుని చేతిలో పెట్టి ఆయన మీదే నమ్మిక యుంచినప్పుడు ఆ వ్యక్తి జీవితం దేవుని యొక్క విశిష్ఠ ప్రణాళికలో అద్భుతంగా వర్ధిల్లుతుంది. చాలా మంది తమ జీవితాన్ని దేవుని కంటే తామే బాగా తీర్చిదిద్దుకోగలమని, స్వంత నిర్ణయాలను తీసుకొని వాటిలో జయం కోసం ప్రార్థిస్తూ ఉంటారు. వీరు దేవుని మీద నమ్మిక యుంచినవారుగా దేవుని యొక్క వాక్యం ఒప్పుకొనదు. "నీ మార్గమును యెహోవాకు అప్పగింపుము నీవు ఆయనను నమ్ముకొనుము ఆయన నీ కార్యము నెరవేర్చును" కీర్తన 37:5. తమ మార్గములను దేవునికి అప్పగించుకొనిన (Committed) జీవితాలను ఆయన అనూహ్యముగా ఫలింపచేస్తాడు. గొఱ్ఱెల కాపరిగా ఉన్నప్పుడే దావీదు తన మార్గమును దేవునికి అప్పగించుకున్నాడు. దేవుని యందు పూర్ణహృదయంతో నమ్మిక యుంచాడు. కాబట్టి దేవుడు ఇశ్రాయేలీయులకు రాజుగా అభిషేకించాడు. ధనబలాన్ని, కండబలాన్ని, విద్యాబలాన్ని కాక కేవలం దేవుని మీదే నమ్మిక యుంచడం అనుకున్నంత సులభమైన పని కాదు. ఇది శరీరానికి ఏమాత్రం నచ్చని, బాధాకరమైన పద్ధతి. దేవునియందే నమ్మికయుంచడం అంటే నీకు ఏమీ చేతకాదు, నువ్వు చచ్చావు అని శరీరంతో చెప్పడం. ఆత్మవిశ్వాసమే విజయరహస్యం అని నమ్మే ఈ లోకానికి దేవుని మీద నమ్మికయుంచడం అనేది అవివేకముగాను, ఆత్మనూన్యతాభావము (Inferiority Complex) గాను కనబడుట సహజమే.

మన జీవితములో ప్రతిదానికి ఆయన మీద ఆధారపడి, పూర్తిగా ఆయన యందు నమ్మిక యుంచాలని మన నుండి ఆయన ఆశిస్తున్నారు. "నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణహృదయముతో యెహోవా యందు నమ్మికయుంచుము" సామెతలు 3:5. స్వబుద్ధి అంటే అవగాహన లేదా తెలివి (Understanding). మన తెలివి ఎప్పుడూ మనుష్యుల మీద, డబ్బు మీద, బంధువులు, స్నేహితుల మీద, సౌందర్యము, సామర్థ్యము మీద ఆధారపడమని చెప్తుంది. సాధారణంగా నమ్మికయుంచడం (Trusting) అంటే దేవుని నమ్మటం (Beleiving) అని అనుకుంటూ ఉంటాం, కాని అది సరికాదు. దేవుని యందు విశ్వాసముంచినవారు రక్షించబడి విశ్వాసులుగా (Believers) మార్పు చెందినప్పటికి వారిలో చాలా కొద్దిమందే పూర్ణహృదయంతో దేవుని యందు నమ్మికయుంచుచూ జీవించేవారిగా ఉంటున్నారు. ఇలా జీవించేవారు దేవుని సంఘాలలో 10 నుండి 20 శాతం మాత్రమే ఉంటారనుటలో అతిశయోక్తిలేదు.

నీ జీవితమును ప్రభువైన యేసుక్రీస్తు ఫలింపచేసినట్లుగా ఈ లోకంలో ఉన్న ఏ ఒక్కరూ చేయలేరు. దేవుని యందు నమ్మికయుంచడం ఎంత పరిమాణంలో ఉంటే నీ ఆత్మీయజీవితం కూడా అంతే పరిమాణంలో ఉంటుంది. దేవుని వాక్యాన్ని చదవడం, వినడం, ధ్యానించటం ద్వారా ఆయనను ఎక్కువగా తెలుసుకొనవచ్చు. ప్రార్థనలో ఆయనతో గడుపుట

ద్వారా ఆయనతో మన సహవాసమును పెంచుకొనవచ్చు. అయితే మనకు ఆయన మీద నమ్మకం పెరిగేది మాత్రం ఆయన చేతిలో చేయి వేసి జీవితసమస్యల గుండా ప్రతిదినము ఆయనతో నడిచినప్పుడు మాత్రమే, దేవుని వాక్యం వినుటవలన విశ్వాసం కలుగుతుంది. అయితే ఆ విశ్వాసం యొక్క నిజజీవిత ప్రయోగమే దేవుని యందు నమ్మికయుంచడం. విశ్వాసులైన భార్యా, భర్త ఒక దినాన ఓడలో సముద్ర ప్రయాణం చేస్తున్నారు. భర్త ఒక సైన్యంలో అధికారిగా ఉంటూ ఉన్నాడు. ఈలోగా సముద్ర తుఫాను ప్రారంభమైనది. తుఫాను తీవ్రరూపం దాల్చడంతో ఆ భార్య చాలా భయానికి లోనై కలవరపడుతూ ఉంది. భర్త భార్యను సముదాయించడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అప్పుడు భర్త తన తుపాకీ తీసి ఆమె గుండెకు గురిపెట్టాడు. భయపడుతూ ఉన్నావా అని అడిగాడు ఆమెను చూచి. అందుకు ఆమె, అసలు భయమే లేదు ఎందుకంటే ఎంతో ఎక్కువగా ప్రేమిస్తున్న నీవు నన్ను గాయపర్చలేవు అన్నది. అందుకు భర్త, "ఈ గాలి, నీరు కూడా నిన్ను, నన్ను అత్యధికంగా ప్రేమిస్తున్న దేవుని చేతిలో ఉన్నాయి. అవి భయంకరంగా ఉన్నా ఆయన వాటిని మనకు హానిచేయనివ్వడు" అని అన్నాడు. విశ్వాసమనేది దేవుని యందు నమ్మికయుంచడంగా మారనంతవరకు దాని యొక్క నిజమైన ప్రయోజనాన్ని మనం పొందుకొనలేము.

ప్రియ చదువరీ ! నీ జీవితము యొక్క శ్రేయస్సు కోరేవాడు, ప్రతిక్షణం నీ జీవితాన్ని సురక్షితంగా కాపాడేవాడు ప్రభువైన యేసుక్రీస్తు మాత్రమే. కాబట్టి ఆయన చేతులకు మన జీవితాన్ని అప్పగించుటకు సందేహింపక, తండ్రియైన దేవుని యందు నమ్మిక యుంచి ఆయన ప్రణాళికలో వర్ధిల్లుచూ, మన తండ్రి ఎంతో నమ్మదగిన వాడని మన జీవితాల ద్వారా లోకమునకు చూపించెదము.


రండి! పాల్గొనండి!! ఆశీర్వాదం పొందండి !!!

**అక్టోబర్ 2వ తేది ప్రత్యేక ఉపవాస ప్రార్థన**

దేశ క్షేమం, క్రైస్తవ సంఘాల ఉజ్జీవం,
కుటుంబముల ఆశీర్వారము కొరకు దేవునిని వేడుకుందాం.

**సమయం:** ఉదయం గం. 9.00 లకు
వివరములకు: బ్రదర్. రవీందర్, సెల్: 99631 17628



# ప్రార్థన మెట్లు

| | | |
|---|---|---|
| 1. రహస్య ప్రార్థన | – | మత్తయి 6:6 |
| 2. కలిసి ప్రార్థించుట | – | మత్తయి 18:19,20 |
| 3. పట్టుదలతో ప్రార్థించుట | – | రోమా 12:12 |
| 4. తగ్గించుకొని ప్రార్థించుట | – | లూకా 18:13 |
| 5. మెలకువ కలిగి ప్రార్థించుట | – | లూకా 21:36 |
| 6. నిలకడ కలిగి ప్రార్థించుట | – | కొలస్సీ 4:2 |
| 7. నిరీక్షణ కలిగి ప్రార్థించుట | – | రోమా 12:12 |
| 8. ఎడతెగక ప్రార్థించుట | – | 1 థెస్స 5:16,17 |
| 9. ఆసక్తితో ప్రార్థించుట | – | యాకోబు 5:17 |
| 10. అత్యాసక్తితో ప్రార్థించుట | – | అపో.కా 12:5 |
| 11. విసుకక ప్రార్థించుట | – | లూకా 18:1 |
| 12. గోజాడుచు ప్రార్థించుట | – | లూకా 18:5 |
| 13. కన్నీటితో ప్రార్థించుట | – | కీర్తన 6:6 |
| 14. వేదనతో ప్రార్థించుట | – | లూకా 22:44 |

# అనుకరణ

## (Imitation) – సిస్టర్ విజయ

సాధారణంగా కోడి గ్రుడ్లను తల్లికోడి క్రింద ఉంచి పొదగజేస్తారు. బాతు తన గ్రుడ్ల మీద కూర్చుని పొదగటానికి ఇష్టపడదు కనుక బాతు గ్రుడ్లను, కోడిగ్రుడ్లను కలిపి తల్లి కోడి క్రింద పొదగజేసేవారు. పిల్లలు బయటికి రావటానికి బాతు గ్రుడ్లకి 4 వారములు, కోడి గ్రుడ్లకి 3 వారములు పడుతుంది కనుక ముందుగానే బాతు గ్రుడ్లను పెట్టి, ఒక వారం తరువాత కోడిగ్రుడ్లను పెట్టేవారు. ఈ విధముగా రెండిటి పిల్లలు కలిసి బయటికి వస్తాయి. తల్లికోడికి కోడిపిల్లలు, బాతుపిల్లలు అనే తేడా తెలియదు అన్నీ తన పిల్లలే అనుకొని అన్నింటిని జాగ్రత్తగా చూచుకుంటూ, అవసరమైనప్పుడు హెచ్చరికలు ఇస్తూ ఉంటుంది. ఈ విధముగా దినములు గడిచిన తరువాత తల్లి కోడి పిల్లలకు ఏ విధముగా ఆహారమును సంపాదించుకోవాలో నేర్పిస్తూ, సూచనలు ఇస్తూ ఉంటుంది అయితే బాతు పిల్లలు ఈ విషయములో ఎంత మాత్రమూ ఆసక్తిని కనపరచవు.

బాతు పిల్లలు అటూ, ఇటూ తిరుగుతూ ఎప్పుడైతే నీటి మడుగులు కనబడతాయో, ఆ నీటిలోనికి దూకి వాటి స్వభావమును బట్టి ఈదటం మొదలుపెడతాయి. తల్లి అరచిననూ అవి వెనుకకు మాత్రం తిరిగి రావు. ఇది చూచిన ఒక అల్లరి కోడిపిల్ల తాను కూడా వాటి వలె ఈదాలని వాటిని అనుకరించాలని నీటిలోనికి దూకి ఈదటానికి ప్రయత్నించినప్పుడు, కుదరక నీటిలో మునిగిపోతూ ఉంటుంది. బయటికి రావాలని ఎంతగా ప్రయత్నించిననూ సాధ్యం కాక మునిగిపోతూనే ఉంటుంది. తల్లి కేకల్ని బట్టి రైతు వచ్చి కాపాడి, శరీరమునకు వేడిని కలుగజేసే స్థలంలో ఉంచుట ద్వారా ప్రాణములతో బయటపడుతుంది. నీటిలో ఈదుట అనేది కోడిపిల్ల స్వభావము కాదు అయిననూ బాతుపిల్లను చూచి ఈదాలని ప్రయత్నించి, తన స్వభావము మార్చుకోవాలనే ప్రయత్నంలో ప్రాణములను కోల్పోయే పరిస్థితిని తెచ్చుకుంది.

మన జీవితములో కూడా ఇతరులను అనుకరించుట ద్వారా ప్రమాదములను కోరితెచ్చుకుంటాము. నేటి దినములలో లోకములోని నటీనటుల శరీర సౌష్ఠవములను, నడకలను, వారు ప్రవర్తించే విధానములను అనుకరించి, వారి వలె జీవించుట అనేది ఫ్యాషన్‌గా మారిపోవుచున్నది. దేవునిని ఎరుగని వారు ఈ విధముగా ఉంటే, ఎరిగిన వారు కూడా సంఘములలో ఇతరులను అనుకరించుట కూడా భక్తిలో ఒక భాగమే అన్నట్లుగా జీవించుచున్నారు.

బైబిల్‌లో అహష్వరోషు రాజు యొక్క కాలములో ఎస్తేరు అను యూదురాలు అందమైన రూపమును, సుందర ముఖమును గలదై, తన పినతండ్రి అయిన మొర్దెకై యొద్ద పెరుగుచూ ఉండెను. ఆ రాజ్యములో రాణిని ఎంపిక చేయు నిమిత్తమై సౌందర్యవంతులైన కన్యకలందర్నీ సమకూర్చి, షూషను కోట అంతఃపురమునకు చేర్చి స్త్రీలకు కాపరియగు హేగే వశమునకు అప్పగించబడి, శుద్ధి కొరకు సుగంధద్రవ్యములు వారికివ్వవలెనని ఆజ్ఞ చేయబడెను. రాజాజ్ఞయు అతని నిర్ణయమును ప్రచురము చేయబడి కన్యకలు అనేకులు షూషను కోటకు పోగుచేయబడి హేగే వశమునకు అప్పగింపబడగా, ఎస్తేరును రాజు యొక్క నగరునకు తేబడి, స్త్రీలను కాయు హేగే వశమునకు అప్పగింపబడెను.

ఆ కన్యకలైన వారందరికి ఆరునెలలు గోపరసతైలముతోను, ఆరునెలలు

సుగంధవర్గములతోను, స్త్రీల పరిమళ క్రియల కొరకైన మరి వేరు పదార్థములతోను స్త్రీలు పరిమళ క్రియలు ముగించి, 12 నెలల తరువాత రాజు వద్దకు వచ్చినప్పుడు, రాజుకి నచ్చిన కన్యక ఆ రాజ్యమునకు రాణీగా చేయబడుతుంది. అంతఃపురములో నుండి రాజు ఎదుటికి వెళ్ళవలసిన సమయమందు ఆమె యేమేమి కోరునో అది ఆ కన్యకలైన వారికి ఇవ్వవలెను అన్న ఆజ్ఞ ఇయ్యబడినది. నిర్ణీత సమయం అనగా సంవత్సర కాలం గడిచిన తరువాత కన్యకలందరూ రాజు వద్దకు వెళ్ళే సమయం వచ్చినప్పుడు ఒక్కొక్క కన్యక హేగే చెప్పిన అలంకారం కాక, వారు కోరుకున్న వాటితో అలంకరించుకొని రాజు ఎదుటికి వెళ్ళారు. కానీ ఎస్తేరు మాత్రం తన చుట్టూ ఉన్న వారిని చూచి అనుకరించక తాను ఎవరి వశమున ఉంచబడిందో అనగా హేగే చెప్పిన అలంకారం తప్ప మరి దేనినీ ఆశించలేదు, అలంకరించుకోలేదు. ఈ విధముగా రాజు ఎదుటికి వెళ్ళిన ఎస్తేరు రాజు యొక్క దయను పొందుకొని, ఆ రాజ్యమునకు రాణిగా ఎన్నిక చేయబడింది.

మన జీవితములో మన చుట్టూ ఉన్నవారి స్వభావము, మాటలు, ప్రవర్తన ఏ విధముగా ఉన్ననూ, వారిని అనుకరించే వారిగా ఎంత మాత్రమూ ఉండకూడదు. దేవుడు మనలను ఆయన పోలిక చొప్పున, ఆయన స్వరూపములో సృజించారు. ఆయన పోలికలో సృజించబడిన మనము ఆయన మనసును, గుణలక్షణములను కలిగి, కుటుంబములలో ఆ విధముగా అనుసరించవలసిన వారమై ఉండగా, మన తోటివారిని, బంధువులను, స్నేహితులను చూచి, వారిని అనుకరించే వారిగా ఉంటున్నాము.

మనము అనేకసార్లు మన రూపమును బట్టి, మాటలను బట్టి, ప్రవర్తనను బట్టి, మనల్ని మనము కించపరుచుకుంటూ, నేను వారి వలె లేను, నా రూపము వారి వలె లేదు అని అనుక్షణము మార్పు పొందాలని, అనుకరించాలని కోరుకుంటాము. మన యొక్క రూపము, మాటలు, క్రియలను బట్టి ఆయన మనలను రక్షించలేదు. ఆయన కృప ద్వారా రక్షించబడిన మనము ఆయనను పోలి జీవించాలి. దేవుడు ప్రతి ఒక్కరి పట్ల ప్రత్యేకమైన శ్రద్ధని, ఉద్దేశ్యమును కలిగి ఉన్నారు. నన్ను వారు ఉన్న స్థానంలో ఉంచితే, నాకు వారికి ఉన్నట్లుగా అన్నీ సమృద్ధిగా ఉంటే, నేను దేవునిలో బాగా వాడబడతాను అనే ఆలోచనలు మనకి ఉండకూడదు.

ఆయన మనలను ఏ స్థితిలో ఉంచారో ఆ స్థితిని బట్టి సంతోషించేవారిగా ఉండాలి కానీ ఇతరులతో పోల్చుకొని, వారిని బట్టి ఆ విధముగా లేము అనే నిరాశలలోనికి వెళ్ళి దేవుని ఉద్దేశ్యములను నెరవేర్చని వారముగా ఉండిపోవుచున్నాము. ఈ విధముగా కాక, మన స్థితిని ఇతరులతో పోల్చుకొని అనుకరించే వారిగా కాక మనల్ని మనము దేవునికి అప్పగించుకునే వారముగానే ఉండాలి.


ప్రియ సహోదరీ ! సహజముగా స్త్రీలమైన మనము ఇతరులతో పోల్చుకొని, వారిని అనుకరించుటలో ఆసక్తిని ఎక్కువగా కనపరుచుచూ ఉంటాము. ఈ విధమైన అనుకరణ మన పట్ల ఉంచిన ఉద్దేశ్యములను నెరవేర్చునట్లుగా నడిపించదు. నన్ను నన్నుగానే దేవుడు ఏర్పరచుకున్నారు, ఇతరులను అనుకరించుటకు కాదు, “నేను నేనే, వారు వారే” అన్న తలంపు మనకి, ఎంతో ధైర్యమును కలిగిస్తుంది. వారివలె నేను లేను అన్న తలంపు మనకు నిరుత్సాహం కలిగిస్తుంది. కాబట్టి “నేను నేనే, వారు వారే” అన్న మాటను హృదయంలో చేర్చుకొని, దేవుని ఉద్దేశ్యములను మన వ్యక్తిగత, కుటుంబ జీవితములలో నెరవేర్చే వారిగానే ఉందాము. అట్టి కృప దేవుడు మనకి అనుగ్రహించును గాక !

# మరపురాని బహుమానం

Family అను ఇంగ్లీషు మాటకు కుటుంబము అని అర్థము. Family అను మాటలోని 5 అక్షరములకు అర్థము Father And Mother In Love Year - round సంవత్సరములన్నీ కూడా భార్యాభర్తలు ప్రేమతో జీవించాలని అర్థము.

వివాహము జరిగి 10 సం॥లు గడిచిన భార్యాభర్తలు ఇరువురు ఒక ప్రాంతంలో నివసిస్తూ ఉండేవారు. వారికి సంతానము లేదు. అయితే సంతానము లేని కారణమున ఆ భర్త తన భార్యకు విడాకులిచ్చి, మరియొక స్త్రీని వివాహము చేసుకొని, తన వంశముయొక్క పేరును నిలబెట్టుకోవాలని ఆలోచిస్తూ అప్పుడప్పుడూ తన భార్య దగ్గర విడాకుల విషయమును ప్రస్తావిస్తూ ఉండేవాడు. భార్య మాత్రం తన భర్తను ఎంతగానో ప్రేమిస్తూ ఉండేది.

భర్త ఒకరోజు ఒక పెద్దాయన దగ్గరకు వచ్చి విడాకుల విషయం ప్రస్తావించి న్యాయం తీర్చమని అడిగాడు. అప్పుడు పెద్దాయన తెలివిగా నీ అభ్యర్థన మేరకు న్యాయం తీరుస్తాను కానీ దానికి ముందు నీవు మీ పెళ్ళిరోజున (Wedding Day) ఒక విందును సిద్ధపరిచి, బంధువులందర్నీ ఆహ్వానించమని చెప్పాడు. దానికి అతను ఒప్పుకొని విందుని ఏర్పాటు చేసాడు. ఆ విందు జరుగుతున్న రోజు భార్య ఆ పెద్దమనిషి సలహాతో భర్తని ఒక కోరిక కోరింది. మనం కలిసి సంతోషంగా జీవించిన రోజులకు గుర్తుగా నాకు ఏమి ఇస్తారు ? అని అడిగింది. అందుకు భర్త నీకు అత్యంత ప్రియమైనది, ప్రాణానికి ప్రాణమైన వస్తువు ఏదైననూ గుర్తుగా నీవు నా ఇంటిలో నుండి తీసుకు వెళ్ళవచ్చు అని సమాధానమిచ్చి, మత్తుగా నిద్రపోయాడు.



ఆ తరువాత రోజు ఉదయమునే నిద్ర లేచిన భర్త తాను భార్య ఇంటిలో ఉన్నానని గమనించి నన్ను ఇక్కడికి ఎవరు తీసుకువచ్చారు ? అని కోపముతో భార్య మీద మండిపడ్డాడు. భర్త ఎప్పుడు నిద్ర నుండి మేలుకుంటాడా ? అని మంచం ప్రక్కనే కూర్చుని ఓర్పుతో ఎదురు చూస్తున్న భార్య , నేను మీరు చెప్పిన మాటనే చేసాను. నాకు అత్యంత ప్రియమైన, ప్రాణమునకు ప్రాణమైన దానిని మీ ఇంటి నుండి తీసుకొని వచ్చాను అని సమాధానమిచ్చింది.

భార్య సమాధానం విన్న భర్త కన్నులు తెరువబడి, హృదయములో ఎంతో మార్పు కలిగింది. తన పనికి, ఆలోచనలకు ఎంతో సిగ్గుపడ్డాడు. భార్యని క్షమాపణ అడిగి, ఆమెను ప్రేమించుట మొదలుపెట్టాడు. తరువాత ఆ కుటుంబము ఒకరి నొకరు ప్రేమించుకుంటూ, దేవునికి మొదటి స్థానం ఇచ్చి, ఆనందముతో జీవించుట వలన దేవుడు వారికి ఒక చక్కని కుమారుడిని అనుగ్రహించారు.

వివాహము అనునది దేవుడు ఏర్పరచినది. ఈ బంధములో భార్య, భర్తలలో లోపము ఎవరిదైననూ ఒకరిని ఒకరు క్షమించుకొని, ప్రేమతో జీవించుటలోనే సంతోషము దాగి ఉంటుంది. జీవితము చివరి వరకు ప్రేమ అను బంధముతో పరలోక సంతోషమును భూమి మీద ప్రతిబింబింపచేసే కుటుంబములుగా ఉండాలనే దేవుని ఉద్దేశ్యము నెరవేరాలని ఆశిద్ధాము.

# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 6వ భాగము**



సుందర్ స్నేహితుడైన సిర్ధార్ కూడా క్రీస్తు ప్రభువుని బాహాటంగా ఒప్పుకొని ఆయనను గూర్చి బైబిల్‌లో వ్రాయబడినది సత్యమేనని తెలియచేసాడు. సిక్కు కుటుంబములకు చెందిన సుందర్, సిర్ధార్ క్రీస్తు ప్రభువు యెడల నిజమైన ఆసక్తితో ఉన్నారని తెలుసుకున్న కుటుంబసభ్యులు ఎంతో ఎగతాళి చేసి, నిరాదరణకు గురి చేసిననూ వీరు తమ విశ్వాసంలో ఎంతో దృఢంగా నిలబడ్డారు. సుందర్ విషయమునకొస్తే అంటరాని ఆ మురికి వారితో చేరి నీ కుటుంబ గౌరవమును గంగలో కలపొద్దు అని తండ్రి ఎంతో బ్రతిమాలుచూ చెప్పిన మాటలను భరించలేకపోయేవాడు.

ఆ గ్రామంలోని క్రైస్తవులలో అత్యధికులు పాకీ పనివారు. సిక్కులలో ఉండే అతి పరిశుభ్రతతో పోలిస్తే, వ్యక్తిగత అలవాట్లలో ఎంతో మురికిగాను, సాంఘికంగా ఎంతో హీనస్థితిలోను వీరు ఉండేవారు. నిజానికి సమాజములో వీరికి అస్సలు స్థానమే లేదు. అటువంటి వీరు మత సంబంధమైన ప్రముఖ విషయములకు రావడమనేది సిక్కుల, హిందువుల సాంప్రదాయానికే గాక సుందర్ కుటుంబ సాంప్రదాయమునకు, తన తల్లి సాంప్రదాయమునకు ఎంతో విరుద్ధం. ఇలాంటి వారితో కలిసిపోయి తన కుటుంబమునకు అవమానము ఎలా తీసుకొని రాగలడు. తన కుటుంబ సభ్యులు తన ముందు ఉంచిన శోధన కంటే ఈ వాదనను ఎదుర్కోవడం సుందర్‌కి ఎంతో కష్టంగా ఉంది.

సుందర్‌కి కుటుంబసభ్యుల ద్వారా కలిగిన శోధన ఏమనగా : వయసులో పెద్దవాడును, బంధువులందరిలో ఎంతో గౌరవప్రదంగా ఉండే ధనవంతుడైన మామ సుందర్‌ని ఆడంబరమైన తన ఇంటికి తీసుకొని పోయి నేల మాళిగలో ఉన్న ఓ పెద్ద ఇనుపపెట్టెను తెరిచి చూపించాడు. సుందర్ ఇంతకు ముందెన్నడూ చూడనంత డబ్బు, విలువైన నగలు దాని నిండా ఉన్నాయి. నీవు సిక్కుగానే ఉంటే ఈ ఐశ్వర్యమంతా నీదేనని చెప్పేసరికి సుందర్ ఎంతో కలవరం చెందాడు. అంతేకాక తన తలపాగా తీసి సుందర్ పాదముల దగ్గర పెట్టి దీనాతిదీనంగా బ్రతిమాలాడు. మామ చేసిన ఈ పని సుందర్‌ని ఎంతో కలవరపరిచింది. కుటుంబములో అందరి కంటే చిన్నవాడైన తన ముందు ఆ సిక్కు కుటుంబములో అందరి కంటే పెద్దవాడైన మామ ఇలా చేయడం చూచినప్పుడు వారందరూ తన విషయంలో ఎంతగా ఆదుర్దా చెందుచున్నారో సుందర్‌కి బాగా అర్థమైపోయింది. వీటన్నిటి ద్వారా వారందరు తనని ఎంతగా ప్రేమించుచున్నారో సుందర్‌కు అర్థం కావడమే గాక, తన తల్లినైననూ, తండ్రినైననూ, నాకంటే ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడనే వాక్యములో దాగియున్న శిష్యత్వపు క్రమమును అనుభవములో చూడసాగాడు సుందర్. కుటుంబం మీద ఉండే ప్రేమాభిమానములు ఎంతో బలీయమైనవి, వాటిని తెగతెంపులు చేసుకోవాలంటే

హృదయాంతరాలను కలత పర్చుకోక తప్పదు. తండ్రికి కలిగిన ఆశాభంగము, నిరాశ, కుటుంబములో మిగిలిన వారు వెలివేసినట్లుగా చూడటాన్ని భరించడం సుందర్‌కి చాలా కష్టమైపోయింది.

దీని తరువాత పరిస్థితి మరో రూపమును సంతరించుకుంది. తల్లిదండ్రుల మతమును విడిచిపెట్టి క్రైస్తవ మతమును స్వీకరించమని తన కుమారుడ్ని బలవంతము చేస్తున్నారన్న అభియోగంతో ప్రెస్బిటేరియన్ మిషన్ స్కూలు అధికారులపై దావా వేయాలని సుందర్ స్నేహితుడైన సిర్ధార్ తండ్రి నిర్ణయించుకున్నాడు. సహజంగానే చుట్టుప్రక్కల వారందరూ దీనిని గురించి చర్చించుకోనారంభించారు. హెడ్మాష్టరు ఇంకా మిగిలిన వారితో కలిసి కోర్టుకు హాజరు కమ్మని దూరంలో మరో ప్రాంతంలో ఉన్న మిషన్ అధికారికి తాఖీదు పంపించారు. అయితే యేసుక్రీస్తు నందు విశ్వాసముంచమని తనని ఎవ్వరూ బలవంతం చేయలేదని చెప్పుచు తన చేతిలోని బైబిలును పైకెత్తి చూపిస్తూ పాదిరిగారి మాటల వలన కాదు గాని ఇదిగో ఈ బైబిలు చదివి నేను క్రీస్తును నమ్మాను. కాబట్టి పాదిరిని వదిలి పెట్టండని సిర్ధార్ సాక్ష్యం చెప్పడంతో ఆ కేసును కొట్టివేశారు.

సుందర్ కూడా అలాంటి సాక్ష్యమే చెప్పాడు గాని ఈ సంఘటన స్థానికులైన ప్రజల మనస్సులలో నిలిచిపోయింది. దీనితో అల్పసంఖ్యాకులైన క్రైస్తవులకు గడ్డుకాలం వచ్చింది. పరిస్థితులు విషమించడంతో వారిలో చాలామంది ఊరు విడిచి వెళ్ళిపోయారు. స్థానిక హిందువులు, సిక్కులలో చాలా మంది తమ పిల్లలను స్కూలు మాన్పించడంతో కొద్ది వారములలోనే దానిని మూసివేయాల్సి వచ్చింది.

సుందర్‌సింగ్ విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం వస్తుందోనని భయపడిన షేర్సింగ్ లూధియానాలో నున్న ప్రెస్బిటేరియనం హైస్కూలుకు సుందర్‌ను పంపించే అవకాశం వచ్చేసరికి ఎంతో సంతోషించాడు. అంతే కాకుండా అవమానం తెస్తూ గ్రామంలో ఉంచబడటం కంటే సుందర్‌ను దూరంగా పంపటమే బాగుంటుందనుకున్నాడు తండ్రి. సుందరైతే దీనిని అదృష్టంగా భావించాడు. క్రైస్తవ సమాజం మధ్య చేరి తన క్రైస్తవ విశ్వాసమును స్వేచ్ఛగా వెల్లడిస్తూ, క్రైస్తవ హాస్టలులో ఉండడం వలన తాను మంచి విద్య నభ్యసించగలననుకున్నాడు. అచ్చటి మిషనెరీలు సుందర్‌ని సహృదయంతో చేర్చుకొని అతని ఇంటి వారితో ఎలాంటి గొడవ రాకుండేందుకు గానూ సిక్కుల ఆచార ప్రకారమే సుందర్‌కు వంట చేయించడానికి ప్రత్యేకమైన యేర్పాటు చేసారు. అయితే హాస్టలులోని విదార్థుల ప్రవర్తనను, మాటలను వారు ఏ మాత్రమూ అదుపుచేయలేకపోయారు. అక్కడ తనను బహుగా కలత పెట్టిన విషయాలేమిటో సుందర్ వెల్లడించక పోయినప్పటికిని ఏ కుర్రవాళ్ళతో తన క్రైస్తవ విశ్వాసాన్ని పంచుకోవాలనుకున్నాడో వారందరు కేవలం నామకార్థ క్రైస్తవులని తెలిసికొన్న సుందర్ అదిరిపోయాడు. ప్రాథమిక పాఠశాలలోని ప్రధానోపాధ్యాయునితో,తన వలెనే విశ్వాసం కలిగియున్న సిర్ధార్‌తోను తప్ప మరెవరితోను సన్నిహిత సంబంధమును కలిగియుండలేదు. లూధియానాలోని పాఠశాలలో క్రైస్తవులను గూర్చి తనకు ఉండిన భ్రమలు తొలగిపోవడంతో మొదటిసారి సెలవులకు ఇంటికి వెళ్ళిన సుందర్ మరలా తిరిగి హాస్టల్‌కు రాలేదు. దీనితో క్రైస్తవుడ్ని కావాలనే అభిప్రాయమును సుందర్ విరమించుకున్నాడేమోనని ఇంటి వారందరూ ఎంతో సంతోషించారు.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)



# ధైర్యం

Hai Children ఎలా ఉన్నారు ? మీరు ఆరోగ్యంగా ఉన్నారా? ఎక్కడ చూచినా రకరకాల వ్యాధులు మనలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పిల్లలకు తొందరగా వ్యాధులు సోకే అవకాశం ఉంది కనుక మీరు జాగ్రత్తగా ఉండండి. మనం తీసుకొనవలసిన జాగ్రత్తలు మనము తీసుకుందాం. అప్పుడు దేవుడు **"ఏ అపాయము నీ యొద్దకు రాదు"** అనే వాగ్దానము ద్వారా మనలను కాపాడతాడు.

అనగనగా ఒక ఊరిలో షద్రకూ, మేషాకు, అబెద్నెగో అను ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆ దేశాన్ని పరిపాలించే రాజు దేశ ప్రజలందరికి ఒక ఆజ్ఞ ఇచ్చాడు. ప్రజలందరూ రాజు గారు నిలువ పెట్టించిన విగ్రహమునకు నమస్కారం చేయాలి. ఆలాగు చేయని వారు అగ్నిగుండంలో వేయబడాలి అనేది రాజాజ్ఞ .

అప్పుడు ఆ పిల్లలు మేము విగ్రహమునకు నమస్కరించము. మా దేవుడు అగ్నిగుండంలోనుండి రక్షించుటకు సమర్థుడు. ఒకవేళ రక్షించకపోయినా మేము మాత్రం నమస్కారం చేయము అని ఖచ్చితంగా రాజుకి బదులు చెప్పారు. అప్పుడు రాజు కోపంతో వారిని అగ్నిగుండంలో వేయుడని ఆజ్ఞ ఇచ్చెను. ఆ ముగ్గురినీ ఆ గుండములో పడవేయగా రాజు కోపముగా చూచుచుండెను.

రాజు, మనము ముగ్గురు మనుష్యులను వేసితిమి గదా అని తన మంత్రుల నడిగెను. వారు రాజుతో నిజమే అనెను. అందుకు రాజు నేను నలుగురు మనుష్యులను చూచుచున్నాను, నాలుగోవాడు దేవదూతను పోలియున్నాడనెను. వారిని బయటికి రమ్మని పిలువగా ఆ మంటల్లోనుండి బయటికి వచ్చారు. ప్రజలందరూ గుమికూడి వారిని పరిశీలనగా చూశారు. వారి శరీరాలకు అగ్ని వలన ఏ హాని కలగలేదు. వారి తలవెంట్రుకలలో ఒక్కటి కూడా కాలిపోలేదు. వారి బట్టలు కాలిపోలేదు. అగ్ని వాసన కూడా వారిని అంటలేదు.

అప్పుడు రాజు ఇలా అన్నాడు. షద్రకు, మేషాకు అబెద్నెగోల దేవునికి మహిమ కలుగునుగాక ! ఆయన తన దూతను పంపి తనను నమ్ముకున్న ఈ ముగ్గురినీ రక్షించెను. వారు తమ దేవుణ్ణి తప్ప మరే దేవుని పూజించము, అని తమ శరీరాలను అప్పగించి వేశారు. కనుక ఇప్పుడు నా ఆజ్ఞ ఏమిటంటే, ఏ ప్రజల్లో గానీ, ఏ ప్రాంతంలోగానీ, ఏ భాషల్లో మాట్లాడే వాళ్ళలోగానీ ఎవరైనా వీరి దేవునికే నమస్కరించాలి. ఎందుకంటే "ఈ దేవుడు రక్షించినట్టు మరేదేవుడు రక్షించలేడు".



చూశారా పిల్లలూ ఆ ముగ్గురూ దేవుని మీద కలిగియున్న నమ్మకం ఎంత అద్భుతమైనదో ! వారు నమ్ముకొన్న దేవుడైన ప్రభువు వారి ప్రాణములను కాపాడినట్లుగా మీరు కూడా యేసయ్యను నమ్ముకొనుట ద్వారా ఎంతటి కష్టము నుండైనా గట్టెక్కేస్తారు.

– ప్రేమతో మీ అక్కయ్య

# "నా జీవితములో దేవుని మేలులు"

- జయమ్మ, అన్నవారప్పాడు

ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీ అందరికీ నా హృదయపూర్వక వందనములు. నా పేరు జయమ్మ, మాది అన్నవారప్పాడు, పశ్చిమగోదావరి జిల్లా.

మాది హైందవ కుటుంబము. మాకు వివాహము జరిగిన 7 సం॥ తరువాత వ్యవసాయములో బాగా నష్టపోయి, బ్రతుకు తెరువు నిమిత్తం హైదరాబాద్ వచ్చి కూలిపనులు చేసుకుంటూ ఉప్పల్ దగ్గరలోని రామంతపూర్‌లో ఉండేవాళ్ళము. తరువాత నా భర్త తాపీ పని నేర్చుకొని చేస్తుండేవారు. కానీ ఇంట్లో ఎప్పుడూ కరువు, అనారోగ్యం, ఆర్థిక సమస్యలు, అసమాధానం, నిందలతో బాధపడుతూ ఉండేవాళ్ళము. వాటి నుండి విడిపించబడాలని శాంతి, సమాధానం కోసం నేను అనేక పూజలు చేసేదానిని. 2002వ సం॥లో మేము చింతల్ ప్రాంతంలో స్థిరపడాలనే ఉద్ధేశ్యంతో అప్పు చేసి ఒక ఇల్లు కట్టుకున్నాము. ఆ సమయములోనే నా భర్తకు అనారోగ్యము కలిగింది. రోజు రోజుకి క్షీణించిపోతున్న ఆయన ఆరోగ్య స్థితి చూచి ఆయన చనిపోతాడేమోననే భయముతో మా ఊరికి తీసుకువెళ్ళిపోయాను. హాస్పిటల్‌కు తీసుకువెళ్ళి పరీక్షలు చేయించినప్పుడు ఆయనకు మరణకరమైన వ్యాధి అని తెలిసింది. ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబము అంతా చాలా కృంగిపోయి, నిరాశలోకి వెళ్ళిపోయాము. ఆయనకు ఎలాంటి చెడు అలవాట్లు లేవు కానీ ఈ వ్యాధిని బట్టి బంధువులు, మాకు తెలిసిన వారు ఆయనని చాలా నిదించేవారు. మమ్మల్ని హీనంగా చూచేవారు. ఇటువంటి పరిస్థితులలో ఆయనకు బ్రతుకు మీద ఆశ లేకుండా పోయింది. ఆ సమయములో మా తమ్ముడు, చెల్లి మాకు యేసుప్రభువు చేసే ఆశ్చర్యకార్యములు చెప్పేవారు. ఆ పరిస్థితులు, శ్రమల వలన మేము దేవుని గురించి తెలుసుకున్నాము, ప్రార్థన చేసుకుంటూ ఉన్నాము. నా భర్త అయితే ఉన్న ఇంటిని అమ్మి, అప్పులను తీర్చి మా ఊరు వెళ్ళిపోవాలనే ఆలోచనతో ఉండేవారు. కానీ కొన్ని నెలలకే ఆయన ఊరిలో మరణించారు. ఆయన మరణించిన తరువాత ఇల్లు అమ్ముకొని తిరిగి ఊరు వెళ్ళిపోదామనే ఉద్ధేశ్యంతో మేము హైదరాబాద్ వచ్చాము.


అప్పటికి నా కుమారుడు ఇంటర్, కుమార్తె టెన్త్ పూర్తి చేసారు. నాకు చదువు, జ్ఞానము లేదు. ఈ కుటుంబమును ఎలా ముందుకి నడిపించాలో తెలియక, భయంతోను, చాలా దుఃఖముతోను, నిరాశతోనూ ఒంటరిగా ఉండేవాళ్ళము. ఆయన మరణించిన తరువాత మమ్మల్ని బంధువులు, ఇరుగు పొరుగు వారు పలకరించి ఆదరించిన వారు లేకపోగా అప్పుల వాళ్ళ ఒత్తిడి. ఈ పరిస్థితిలో నా ఆరోగ్యం కూడా క్షీణించిపోవటంతో నాకు చనిపోవాలనిపించేది. నా కుమారుడు కూలిపని చేస్తూ కుటుంబమును పోషించేవాడు. అప్పుడు దేవుని యొక్క మహా కృపను బట్టి ఒక సహోదరి ద్వారా మాకు ఎపఫ్రా మినిస్ట్రీస్ పరిచయమయ్యింది. అక్కడ బోధించబడే వాక్యం, చేసే ప్రార్థనలు, సంఘస్థుల ప్రేమ

దుఃఖముతో కృంగిపోయి ఉన్న మాకు దేవుని కోసం జీవించాలనే తపనను కలిగించాయి.

మా కుటుంబ పరిస్థితి తెలిసి సేవకులు దేవుని మాటలతో మమ్మల్ని ఆదరించి, మా కొరకు ప్రార్థించేవారు. దేవుని ప్రేమను తెలుసుకున్న మా కుటుంబం అంతా పాపక్షమాపణ నిమిత్తం బాప్తీస్మం పొందాము. అప్పుల వాళ్ళ ఒత్తిడితో భయపడుతున్న నాకు దేవునినిబట్టి ఎంతో ధైర్యం కలిగింది. నా కుమారుడికి ఒక మంచి ఉద్యోగం రావాలని, కూలీపని నుండి దేవుడు విడిపించాలని ప్రార్థన చేసుకునేదానిని. సేవకుల ప్రార్థన ద్వారా, పరిచర్యలోని ఉపవాస ప్రార్థన ద్వారా కనికరసంపన్నుడైన దేవుడు నా కుమారుడికి ఒక శ్రేష్ఠమైన ఉద్యోగము ఇచ్చారు. క్రమముగా కుటుంబములో ఆర్థిక ఇబ్బందులు తొలగించి సమృద్ధిని దయచేసారు. దేవుని కృప, దైవసేవకుల ప్రార్థన ద్వారా ఏ ఇంటిని అయితే అమ్ముకొని వెళ్ళిపోదాము అని అనుకున్నామో, ఆ ఇంటినే బాగు చేసుకొని మేము సంతోషంగా, సమాధానంగా, ఆరోగ్యంగా ఉండటానికి దేవుడు సహాయం చేసారు.

జీవితములో వచ్చిన కష్టములను బట్టి కృంగిపోయి చావు కోసం ఎదురుచూస్తూ దుఃఖంతో ఉండేదానిని, కానీ దేవుడు అల్పురాలిని అయిన నా జీవితంలో ఎప్పుడు ఏది అవసరమో వాటిని సమకూర్చుచూ కుటుంబములో ఎన్నో మేలులను చేసి, ఆయన నామమునకు మహిమకరంగా బ్రతకాలనే ఆశను కలిగించిన దేవునికి వందనములు.

"మరణము నుండి నా ప్రాణమును, కన్నీళ్ళు విడువకుండా నా కన్నులను, జారిపడకుండా నా పాదములను నీవు తప్పించియున్నావు" అని లేఖనములలో ఉన్న విధముగా మమ్ములను నిలిపి ఉంచిన దేవునికి స్తోత్రములు. నేను, నా కుటుంబము, చివరి శ్వాస వరకు కృజ్ఞతతో ఆయన కోసమే జీవించాలని ప్రార్థించగలరు.



# ఇది తెలుసా?
## (కంబోడియా)




కంబోడియా అను దేశము ఆసియా ఖండములో ఉంది. నవంబర్ 9, 1953వ సం॥లో ఫ్రాన్స్ నుండి స్వాతంత్ర్యం వచ్చింది.

| | | |
|---|---|---|
| ప్రధాని | : | హన్‌సన్ (Hunsen) |
| రాజధాని | : | ఫ్నాన్ ఫెన్ (Phnon penh) |
| జనాభా | : | 14,805,000 |
| అధికార భాష | : | ఖమెర్ (Khmer) |
| కరెన్సీ | : | రియల్ (Riel) |

1. తలసరి ఆదాయమును పరిశీలించినప్పుడు ఎంతో వెనుకబడిన దేశముగా ఉన్నది.
2. మౌళిక సదుపాయముల కొరత, రాజకీయ అస్థిరత్వము మరియు ప్రభుత్వంలో ఉన్న అవినీతి వలన విదేశీ పెట్టుబడులకు ఆటంకము కలుగుతుంది.
3. కంబోడియా ఆర్థిక వ్యవస్థకి వ్యవసాయం మూలాధారము. 59% ప్రజలు వ్యవసాయమునకు సంబంధించిన పనులు చేయుచూ ఉంటారు. వస్త్రాల తయారీ, టూరిజం మరియు భవన నిర్మాణములు వంటివి కూడా వ్యవసాయం తరువాత ముఖ్యమైనవి.
4. ఆరోగ్యపరంగా చూస్తే పుట్టిన పిల్లలలో ఎక్కువ శాతం మంది 5 సం॥లోపే చనిపోవుచున్నారు. కారణం సరియైన వైద్యసదుపాయములు లేకపోవుట మరియు ఆరోగ్యం మీద సరైన అవగాహన లేకపోవుట.

15వ శతాబ్దం నుండి బౌద్ధమతం ఆ దేశ అధికారిక మతంగా ఉన్నప్పుడు క్రైస్తవులను ఎంతో హింసించేవారు. 1990వ సం॥ నుండి మాత్రమే క్రైస్తవులు బహిరంగముగా ఆరాధించుకోవటానికి అవకాశం కలుగుతుంది.

ఆసియా ఖండంలో వెనుకబడిన కంబోడియా దేశ ఆర్థిక పరిస్థితుల కొరకు, ఆత్మీయ అంధకారం తొలగించబడి, మంచి క్రైస్తవ నాయకత్వంతో, విరివిగా సువార్త ప్రకటించబడాలని ప్రార్థన చేద్దాము.





# మనకు సంతోషం
# ఎప్పుడు కలుగుతుందంటే...

1. దేవుడు మనలను ప్రేమిస్తున్నారు అని గ్రహించినప్పుడు
2. నీ జీవితమును నీవు ప్రేమించినప్పుడు
3. ఎదుటి వారిని ప్రేమించి, వారి చేత ప్రేమించబడినప్పుడు
4. దేవునితో సరియైన సంబంధం కలిగి ఉన్నప్పుడు.
5. వాక్యానుసారముగా జీవించినప్పుడు.
6. దేవుని పని చేసినప్పుడు.
7. పరిశుద్ధంగా, యథార్థంగా జీవించినప్పుడు.
8. కలిగి ఉన్నదానితో తృప్తి పొందినప్పుడు.
9. ప్రతి విషయమును అనుకూలముగా ఆలోచించినప్పుడు.
10. అవసరతలో ఉన్నవారికి సహాయం చేసినప్పుడు.
11. ఇతరులను ఆదరించి, మేలు చేసినప్పుడు.
12. శారీరకంగా, ఆత్మీయంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడు.
13. ఇతరుల యెడల ప్రేమ, దయ, కనికరం కలిగి ఉన్నప్పుడు.
14. ఎదుటి వారి సంతోషములో పాలిభాగస్తులమైనప్పుడు.
15. దేవునిని గూర్చి పాడుచూ, కీర్తించినప్పుడు.
16. రేపటిని గురించి చింతపడక, దేవుని మీద భారం వేసినప్పుడు.
17. దుఃఖం కలిగించే పరిస్థితులలో కూడా చింతించక, నిరీక్షణ, విశ్వాసం కలిగి ఉన్నప్పుడు.
18. క్షమాపణ హృదయం కలిగి మరియు మనము చేసే తప్పులకు ఎదుటి వారిని క్షమించమని ఒప్పుకునే మనసు కలిగి ఉన్నప్పుడు.
19. పరసంబంధమైన వాటి కొరకు వెదకినప్పుడు.
20. అనేకుల కొరకు ప్రార్థించి, ప్రయోజనకరముగా ఉన్నప్పుడు.




# ఆత్మ ఫలము - 4వ భాగము

- ఎడిటర్

**ఆత్మఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, విశ్వాసము, మంచితనము, సాత్వికము, ఆశానిగ్రహము.**

ఆత్మఫలములలో మొట్టమొదటిది ప్రేమ. ప్రేమ మూడు విధములు.

1. దేవుని మీద ప్రేమ  2. పొరుగు వారి మీద ప్రేమ
3. శత్రువు మీద ప్రేమ

**3. శత్రువు మీద ప్రేమ :–** ప్రేమలో భాగముగా మొదట దేవుని మీద, రెండవదిగా పొరుగు వారి మీద, మూడవదిగా శత్రువు మీద ప్రేమను కలిగి జీవించాలి. మనలను ప్రేమించిన వారినే ప్రేమించుట వలన మనకి ఫలమేమి కలుగును ? మన సహోదరులకు మాత్రమే వందనములు చేసిన యెడల మనము ఎక్కువ చేయుచున్నదేమి ? లోకములోని అన్యజనులు అనగా దేవునిని ఎరుగని ప్రజలు కూడా ఆలాగు చేయుచున్నారు. దేవునిని ఎరిగామని, రక్షించబడ్డామని, మార్పు చెందిన జీవిత విధానమును కలిగి ఉన్నామని చెప్పుకుంటున్న మనము శత్రువులను కూడా ప్రేమించేవారిగా ఉండాలి.

యేసుప్రభువు ఈ లోకములోనికి మన పాపముల నిమిత్తమై శిక్షను అనుభవించటానికి శరీరధారిగా వచ్చారు. ఆయన శరీరాకారముతో జీవిస్తూ, అనేకుల హేళనలను, నిందలను, అవమానములను భరించారు. అనేకులు ఆయనను శత్రువుగా భావించి, మాటల ద్వారా, క్రియల ద్వారా హింసించారు, బాధించారు. ఆయనను వెంబడించిన శిష్యుడైన యూదా వెండిని ఆశించి, ఆయనను అమ్ముకున్నాడు. అయిననూ యేసయ్య తనని హింసించిన వారిని, అమ్ముకున్న యూదాని శత్రువులుగా భావించలేదు కానీ వారి యొక్క మేలును కోరారు. ఆయనను శత్రువులకు అప్పగించిన యూదాని కూడా ద్రోహీ ! అని కాక, చెలికాడా అని పిలిచి తన ప్రేమను వెల్లడిపరిచారు. ఆయన శరీరమును సిలువ మీద మేకులతో బంధించుచున్న వారిని కూడా తండ్రీ ! వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించమని వారి క్షేమము కోరారు.

కుటుంబములోని వారినే ప్రేమించలేని స్థితిలో జీవిస్తున్న ఈ దినములలో శత్రువును ఏ విధముగా ప్రేమించగలము ? అనే ఆలోచనలు కలుగుతూ ఉంటాయి కానీ బైబిల్ గ్రంధము ఈ విధముగా చెప్పుచున్నది. మనము పరలోకమందున్న తండ్రి కుమారులమై యుండునట్లు శత్రువులను ప్రేమించి, మనలను హింసించే వారి కొరకు ప్రార్థన చేసే వారిగా ఉండాలి.

యేసయ్య మనలను ఏ విధముగా ప్రేమిస్తున్నారో మనము శత్రువులుగా భావిస్తున్న వారిని కూడా అదే విధముగా ప్రేమిస్తున్నారు. ఆయన చెడ్డవారి మీదను, మంచివారి మీదను తన సూర్యుని ఉదయింపజేసి, నీతిమంతుల మీదను, అనీతిమంతులమీదను వర్షము కురిపించుచున్నాడు. ఈ మాటలను యేసయ్య బోధించుట మాత్రమే కాక, చేసి చూపించారు. మేలు చేసిన వారికి మేలు చేయటమే కాక, కీడు చేసిన వారిని శత్రువుగా భావించక, మేలు చేత కీడును జయిద్దాము.



# అరారాతు పర్వతము

జలప్రళయం తరువాత నోవహు నిర్మించిన ఓడ అరారాతు పర్వతము మీద నిలిచినట్లుగా బైబిల్ గ్రంధములో చెప్పబడుచున్నది. అరారాతు పర్వతము టర్కీ దేశము యొక్క ఈశాన్య ప్రాంతములో ఆర్మేనియన్ మరియు ఇరానియన్ సరిహద్దులకు దగ్గరగా ఉన్న పర్వత శ్రేణులు. ఈ ప్రాంతములో అన్నిటి కంటే ఎత్తైన శిఖరం దాదాపు 4,300 మీటర్లు, ఈ పర్వతము యొక్క టర్కిష్ పేరు అగ్రిదాగి. 1829వ సం॥లో ఈ పర్వతము రష్యన్ల క్రింద ఉంది కానీ 1923లో టర్కీ మరియు రష్యా వారు దీనిని విభజించుకున్నారు. మరల 1991లో దీనిని రష్యా నుండి టర్కీ వారు స్వతంత్రించుకొని వీరి స్వాధీనములోనే ఉంచుకున్నారు. ఈ పర్వతంలో మూడవ వంతు వరకు సంవత్సరం పొడవున మంచుతో కప్పబడే ఉంటుంది.

దేవుడు భూమి మీద నరులను చేసినందుకు హృదయములో నొచ్చుకొని జలప్రళయము ద్వారా నరులను, నరులతో కూడ జంతువులను, పురుగులను, ఆకాశ పక్ష్యాదులను భూమి మీద నుండి నాశనం చేయాలని తలంచారు. ఆ తరములో నిందారహితుడైన నోవహును కనుగొని ఒక ఓడని నిర్మించి, అతనిని, అతని కుటుంబమును, శుద్ధమైన, అశుద్ధమైన ప్రతిరకము జంతువును, ప్రతి రకం పక్షిని, భూమి మీద తిరిగే ప్రతి విధమైనదీ జంట, జంటలుగా మగ వాటిని, ఆడవాటిని ఓడలోనికి ప్రవేశించమని చెప్పెను.

అతి ముఖ్యమైన ఈ ఓడ అంతకు ముందెన్నడూ నిర్మించబడనిది. 450 అడుగుల (137 మీటర్లు) పొడవు, 75 అడుగుల (23 మీటర్లు) వెడల్పు, 45 అడుగుల (14 మీటర్లు) ఎత్తుతో నిర్మించబడినది. నోవహు, అతని కుటుంబం, ఇతర ప్రాణులు ఓడలోనికి ప్రవేశించిన తరువాత ఓడ తలుపు యెహోవా మూసివేసెను. 40 పగళ్ళు, 40 రాత్రుళ్ళు ప్రచండ వర్షము భూమి మీద కురిసెను. 15 మూరల ఎత్తున నీళ్ళు ప్రచండముగా ప్రబలెను గనుక గొప్ప పర్వతములన్నియు మునిగిపోయెను. జలములు విస్తరించి, ఓడను తేలచేసినందున అది భూమి మీద నుండి పైకి లేచి, 7వ నెల 17వ దినమున అరారాతు కొండల మీద నిలిచెను.

ఒక సంవత్సర కాలము పాటు ఈ నీరు భూమి మీద నిలిచి ఉన్నది. ఇది నోవహు భూభాగమునకు మాత్రమే కాక ప్రపంచం అంతటా ఈ జలప్రళయం వ్యాపించినట్లుగా చూడగలము.

1960వ సంవత్సరంలో ఒక పత్రిక వారు విమానములో నుండి చూచినప్పుడు ఒక పడవ వంటి ఆకారము కలిగిన వస్తువు పర్వతము మీద ఉన్నట్లు కనబడుతున్నది అని తెలియచేశారు. తరువాత సంవత్సరములలో పడవ వంటి ఆకారము కలిగిన వస్తువు 30 అడుగుల లోతు మంచులో అరారాతు పర్వతముల మీద నిలిచి ఉన్నట్లుగా ఒక శాటిలైట్ చిత్రము ద్వారా బయటపడింది. ఈ విషయము గురించి నిజము తెలుసుకోవాలని అనేక మంది పరిశోధనలకు బయల్దేరారు. అయితే వీరి పరిశోధనల కొరకు టర్కీ ప్రభుత్వము అనుమతి ఇవ్వవలసి ఉంది. పెద్ద ఓడ మంచులో చిక్కుకొని ఉన్న దానిని వెలికి తీయుట అనేది కష్టమైనప్పటికీ అనేకులు ప్రయత్నిస్తూ ఉన్నారు.

నవంబర్ 1, 2004 నుండి అరారాతు పర్వతముల చుట్టూ ఉన్న ప్రాంతమును సందర్శనా స్థలముగా టర్కీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇది సందర్శకులకు నమ్మకమైనదిగా, ఆకర్షణీయమైనదిగా నిలిచి ఉన్నది.




# బైబిల్ క్విజ్ -6

1. యెహోషువ అని అతనికి ఎవరు పేరు పెట్టిరి ?
2. అంగలార్చిన సౌలు ఉపపత్ని పేరేమిటి ?
3. ఏమి ధరించుకొని అపవాది తంత్రములను ఎదిరించాలి ?
4. నోటి మాట చేత కుష్ఠము సంపాదించుకొనిన స్త్రీ ఎవరు ?
5. యెహోవా హస్తము ఎవరి మీద భారముగా ఉండెను ?
6. ఆకీషు ఎవరు ?
7. భూమి నెర విడిచి లేవి వంశములోని ఎవరి కుటుంబమును మ్రింగివేసెను ?
8. బైబిల్‌లో అధిక సంవత్సరములు జీవించిన వ్యక్తి ఎవరు ? ఎన్ని సం॥లు జీవించాడు ?
9. దేవుని మందసమును పట్టుకొని యెహోవా కోపము చేత చనిపోయిన వ్యక్తి ఎవరు ?
10. సమూయేలు తల్లిదండ్రుల పేర్లు ఏమిటి ?

ఈ ప్రశ్నలకి సరైన రిఫరెన్సులతో సమాధానములు సెప్టెంబర్ 30వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు నవంబర్ పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా:- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

---

**<u>బైబిల్ క్విజ్-5 జవాబులు:</u>**

1. యోనా, నీనెవె 2. ఎనోష (ఆది 4:26) 3. నిమ్రోదు (ఆది 10:9) 4. ఇంటి కప్పు దిగబడిపోవును, ఇల్లు కురియును (ప్రసంగి 10:18) 5. హోషేయ 14:5 6. చితిసారకపు మ్రాను (ఆది 6:14) 7. యెహెజ్కేలు (యెహె 3:3) 8. సిద్కియా (యిర్మియా 52:10,11) 9. మంటపమునకు, బలిపీఠమునకు (యోవేలు 2:17) 10. జప్నత్పనేహు (ఆది 41:45)

**<u>బైబిల్‌క్విజ్-5 ప్రశ్నలకు జవాబులు వ్రాసి పంపినవారి పేర్లు:</u>**

1. ఎ.వెంకటలక్ష్మి (చింతల్) 2. కె.వసంతారాణి సాగర్ (భాగ్యలత)

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## సెప్టెంబర్ - అక్టోబర్

**భాగ్యలత:** మాస్టర్.సందీప్, ఇందిరా ప్రియ, ఇస్సాకు, ప్రసాద్, బేబి. జ్యోతి, బేబి. ప్రియాంక, సుధ, శ్రీలక్ష్మి, బేబి. షాలేము, మాస్టర్. కిరణ్ కుమార్, మాధురి, ప్రేమ్ కుమార్, దీవెన, చెన్నకేశవ రెడ్డి, మాస్టర్. ప్రదీప్ కుమార్, మాస్టర్. స్వరూప్, బేబి. అరుణ, హోసన్న రాణి, మాస్టర్. శేఖర్, కె. ప్రజ్ఞ, అనిత, అన్నపూర్ణ, ప్రీతి, నిర్మల, బేబి. ఉషారాణి, ఫిలిప్పు, కె.సాల్మన్ రాజు, ఎమ్. మాధవి, మాస్టర్. హోసన్న, శామ్సన్, యేసుబాబు, కె. దీపిక, కె. షారోను, ప్రియదర్శిని, వి. సూర్యరాజు, మల్లేశ్వరి, రవి కుమార్ (మిర్యాలగూడ), బి. సైమండ్, కె. సుధారాణి, ప్రణీత్ కుమార్, ప్రసన్న కుమార్.

**చింతల్:** జయరాజు, జయమ్మ, మాస్టర్. సుధాకర్, మాస్టర్. సోనురాజ్, ప్రసాద్, శ్యామ్ శేఖర్, పి. కళ్యాణ్, కె.కృష్ణవేణి, ఎఫ్రాయిము, మాస్టర్. రాజేష్, పద్మజారాణి, పవన్ కుమార్, సునీల్ కుమార్, త్రిమూర్తులు, భవాని, బి.రాజు, దుర్గాప్రసాద్, వేణుకుమారి, మాస్టర్. శ్రీహర్ష వర్మ, మీనా, సంధ్య, ఇందిరాజ్యోతి, శేఖర్, సాగర్, నరేంద్ర, ప్రమీల.

**అనాజ్‌పూర్:** మాస్టర్. వరప్రసాద్, మాస్టర్. కళ్యాణ్ కుమార్, జి. రామారావు, బేబి. సుష్మ, మమత, సి.హెచ్. చంద్రకళ.

**ఇ.సి.ఐ.ఎల్:** సుజని, నానాజీ.

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/-లు, సంవత్సర చందా రూ. 50/-లు, జీవితకాల చందా రూ. 1000/-లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ____________________

2. చిరునామా: ____________________

____________________

____________________

పిన్ కోడ్: ____________________

**మీ ప్రార్థనావసరతలు:**

____________________

____________________

____________________

____________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

# సూసన్నా వెస్లీ



సూసన్నా వెస్లీ భక్తి పరులైన తల్లిదండ్రులకు చిన్నకుమార్తెగా జన్మించెను. ఆమె సౌందర్యవంతురాలు, మిక్కిలి తెలివితేటలు గలది. ఈమె తండ్రి భక్తి విశ్వాసములు గల వాడగుటచే ఆ కాలపు విశ్వాసులకు పరిశుద్ధుడైన పౌలు వంటి నాయకుడు అని పేరొందెను. ఈమె చిన్నతనము నుండి తండ్రి యొక్క దైవభక్తిని, దయాగుణములను అట్లే స్వతంత్రించుకొని మంచి ఆధ్యాత్మిక పుస్తకములను చదువుచూ, ఆలోచనా శక్తిని మంచి చెడులను వివేచించు శక్తిని పెంపొందించుకొనెను. తరువాత రెవరెండ్ సామ్యేల్ వెస్లీ అను వ్యక్తితో సూసన్నా వివాహము జరిగింది. ఈ యౌవన దంపతులు దేవునికి సమర్పించుకొని ఒకరి యెడల ఒకరు గౌరవ భావము కలిగి దేవుని అధికారమునకు లోబడిరి. వీరి గృహము పరలోకపు ప్రేమ చేతను, మాధుర్యము చేతను నిండియుండెను. సూసన్నా తన కార్యములను ఒక దూత వలె నిర్వహించుచుండెను. ఈమెకు 19 మంది సంతానములో 8 మంది మాత్రమే బ్రతికిరి. బిడ్డలనే ఆస్థిగా భావించుకొని, ప్రార్థనతో తన గృహమును నింపి, పిల్లల హృదయములలో విశ్వాసమును నాటుటకు ఎంతో కృషి చేసెను. వారు ఆత్మలో అభివృద్ధి నొందు నిమిత్తము దేవునిలో వారిని కాపాడెను. ఎన్నో ఆర్థిక సమస్యల మధ్య విసుగు చెందక తన పిల్లలను భక్తిలో పెంచిన ధన్యురాలు.

స్వచిత్తమును ఎంత పూర్తిగా లొంగదీయుదుమో అంత మెట్టుకు పిల్లలను బాల్యము నందే భక్తి, నీతి మార్గముల యందు నడుపగలము అన్న ఆలోచన కలిగి దేవుని సహాయముతో వారి స్వచిత్తమును వంచెడిది. బిడ్డలు వయస్సుతో పాటు ప్రార్థన యందును, భక్తి యందును ఎదుగుచుండిరి. ప్రభువా ! నీవు నాకెంతో దయతో ఇచ్చిన బిడ్డల యొక్క హృదయములో నిజమైన భక్తిని, మంచి గుణములను నాటుటకు జాగ్రత్త వహింపగోరుచున్నాను. నా శక్తి కొలది జ్ఞానయుక్తముగా చేయగలుగునట్లుగా, నా ప్రయాస సఫలమగునట్లు ఆశీర్వదించమని ఎడతెగక ప్రార్థించెడిది. ఈ దీనమైన విజ్ఞాపనలను ఆలకించిన కృపానిధియగు తండ్రి ఆమె అడిగిన దాని కంటెను, ఊహించిన దాని కంటెను అత్యధికముగా అనుగ్రహించెను.

మంచి లక్షణములతో పాటు శ్రేష్ఠమైన శాంత స్వభావము, దయాగుణము, ఆకర్షణీయమైన క్రైస్తవ్యము మొదలగునవన్నియు ఈమెను అత్యంత సద్గుణ స్త్రీనిగా తీర్చిదిద్దినవి.

ఒక క్రైస్తవ స్త్రీకి ముఖ్యముగా క్రైస్తవ తల్లికి ఉండవలసిన సుగుణములన్నియు ఈమెలో కన్పించెను. బిడ్డలను పెంచుటలో, కుటుంబమును కట్టుటలో జ్ఞానవంతురాలి వలె జీవించెను. ఈమె చివరి దశలో తన కుమారులైన జాన్ మరియు ఛార్లెస్‌ల సేవలను చూచి, వాటిలో పాలిభాగస్తురాలగుట ఎంతో ఆనంద దాయకముగా ఉండెను.

## ఆగష్టు 15, 2009 న జరిగిన ఉపవాస ప్రార్ధనలో దేశం కొరకు భారంతో ప్రార్ధనలు చేయబడ్డాయి.



# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్-500 070
Ph: 040-24202227 email: mail2church@gmail.com